క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేషంగా అభిషేకాలు



సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, **పూజలు నిర్వహించారు.** ఉదయం నుంచి **మధ్యాహ్నం వరకు** భక్తులు, మహిళలు ఆల**యానికి తరలివచ్చి** స్వామిని దర్శించుకున్నారు**. బిల్వపత్రాలతో** స్వామికి అర్చన నిర్వహిం**చారు. ఆలయ అర్చ**కులు ద్వాదశి సోదరులు**, ఉదయ్‌కృష్ణశర్మ** పూజలు చేశారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపించారు. అనంతరం ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థులు



యోగా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

పరవాడ: ఏపీ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో తానాం గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గురుకుల పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థినులు పాల్గొనగా ఐదుగురు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారని యోగా శిక్షకుడు సీహెచ్.ఆంజనేయులు తెలిపారు. వారు సెప్టెంబరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. బంగారు పతకాలు సాధించిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని కె.హారిక, పదో తరగతి విద్యార్థినులు జి.నిఖిత, పి.లక్ష్మీసాహిత్య, పి.రామసాహిత్య, బి.సంధ్యను, యోగా శిక్షకుడు ఆంజనేయులను ప్రిన్సిపాల్ ఎం.సుహాసిని ప్రత్యేకంగా అభినందించారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం

పరవాడ : పెందుర్తి మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లుగా నియమితులైన గొర్లివానిపాలెం మాజీ సర్పంచ్ గొర్లి కనకరావు, కొత్తపల్లి అపర్ణను కూటమి నాయకులు సోమవారం సత్కరించారు. టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన డైరెక్టర్లను పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు బొండా తాతారావు, రాయవరపు దేముడు, సారిపల్లి జోగినాయుడు, గొర్లి శ్రీనివాసరావు, పైల వరలక్ష్మి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జ్యోతి ప్రమాణస్వీకారం



మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతిని అభినందిస్తున్న ఎంపీ భరత్, నాయకులు

పెందుర్తి : పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవగడ్డ జ్యోతి అప్పలనాయుడు సోమవారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. పులగానిపాలెంలోని జ్యోతి నివాసం నుంచి ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం స్థానిక తాండ్రపాపారాయుడు కల్యాణ మండపంలో టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల నడుమ ప్రమాణం చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి, విశాఖ ఎంపీలు సీఎం రమేష్, భరత్, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, మేయర్ పీలా శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు పేమెంట్ చేస్తే పూజ చేస్తారు.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవి. మన ఆచార వ్యవహారాల్లో ఎన్నో ఆరోగ్యసూత్రాలను ఇమిడ్చారు పూర్వీకులు. పండగలూ అందులో భాగమే. ఋతు ధర్మాలను అనుసరించి, మనం ఆచరించాల్సిన నియమాలు రూపొందించారు. భాద్రపదమాసం ..వర్షాకాలం కావడంతో చెరువుల్లో, కాల్వల్లో పూడికలు తొలగించి మట్టి గణపతి ప్రతిమలను రూపొందించడం.. పార్వతీతనయుడిని అర్చించిన అనంతరం ఔషధ విలువలు గల 21 రకాల పత్రితో అర్చించడం అందులో భాగమే. మధ్యలో వచ్చిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను దూరం పెట్టి మళ్లీ మట్టి గణపతివైపే మొగ్గు చూపుతూ పర్యావరణ హితమైన పండగకు సిద్ధమవుతున్నారు ప్రజలు.



పెందుర్తిలో మట్టి విగ్రహాలు తయారు చేస్తున్న హాస్టల్ విద్యార్థులు



ఆకర్షణీయంగా రూపుదిద్దుకున్న గణనాయకుడు

ఏకోదంతుడికే జై

- మట్టి గణపతి వైపే భక్తుల మొగ్గు
- నియోజకవర్గంలో జోరుగా మండపాల ఏర్పాటు
- వాడవాడలా విస్తృతంగా అవగాహన
- మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో నిమజ్జనాలు నిషేధం



పెందుర్తి రైతు బజార్ వద్ద మట్టి విగ్రహాలు



వివిధ ఆకృతుల్లో సిద్ధమైన గణనాథుడు

పెందుర్తి:

విఘ్నాధిపతి గణేశుడి పూజలకు నియోజకవర్గం ముస్తాబవుతోంది. బొజ్జ గణపయ్య వాడవాడలా కొలువుదీరనున్నాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల పర్యావరణానికి కలిగే హానిని గుర్తించిన ప్రజలు మట్టి వినాయక విగ్రహాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పెందుర్తి, పరిసర ప్రాంతాల్లో గణనాథుడు కొలువుదీరే మండపాలు సిద్ధమవుతున్నాయి.

మట్టి విగ్రహాలపై విస్తృత అవగాహన

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వలన పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుందని పర్యావరణవేత్తలు చెబుతున్న తరుణంలో ఈ ఏడాది అధికశాతం ప్రజలు మట్టి విగ్రహాలనే కొనుగోలు చేస్తున్నారు. పెద్ద మండపాల్లోనూ మట్టి విగ్రహాల ఏర్పాటుకే ఉత్సవ కమిటీలు మొగ్గు చూపుతున్నాయి. పర్యావరణ ప్రేమికులు ప్రజలు ఇళ్లలో పూజించేందుకు వీలుగా అనేక చోట్ల ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల అమ్మకాలు భారీగా తగ్గినట్లు తెలుస్తోంది.

మట్టి విగ్రహాల ధరలు ఇలా..

మట్టి గణపతి 12 అడుగుల విగ్రహం సుమారు రూ.40వేలు, 9 అడుగుల విగ్రహం రూ.25వేలు, అంతకు తక్కువ సైజు విగ్రహాలు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు ఉన్నాయి. వీటికి అలంకారంగా తయారీదారులు వస్త్రాలు, ఆభరణాలు, ఆయుధాలు అందిస్తుండటంతో ఆ విగ్రహాల్లో జీవకళ ఉట్టిపడుతోంది. ఈ మట్టి విగ్రహాలను తగరపువలస, విజయనగరం, పెందుర్తి, వేపగుంట, రావికమతం, కోటపాడు తదితర ప్రాంతాలకు వెళ్లి ఎక్కడ తక్కువకు లభిస్తే అక్కడ కొనుగోలు చేస్తున్నారు. ఇక ఇళ్లలో పూజించే వాటిలో 12 నుంచి 18 అంగుళాలవి రూ.50 నుంచి రూ.100 వరకు మార్కెట్‌లలో లభ్యమవుతున్నాయి.

అనుమతి తప్పనిసరి

వినాయక చవితి ఉత్సవాలకు మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి ఉండాలని పోలీసులు చెబుతున్నారు. మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. డీజేల వాడకాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను గస్తీకి ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాల నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉత్సవ కమిటీలకు అవగాహన కలిగిస్తున్నారు.

సందడి షురూ

పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో సోమవారం నుంచే సందడి మొదలైంది. ప్రధాన కూడళ్ల వద్ద పూజాసామగ్రి కొనుగోళ్లు భారీ ఎత్తున సాగాయి. పత్రి, పుష్పాలు, చెరకుగడలు, మారేడు, మొక్కజొన్న కండి తదితరాల కొనుగోలులో ప్రజలు నిమగ్నమయ్యారు. జోరువానలోనూ మార్కెట్‌కు వెళ్లి సామగ్రిని తీసుకువచ్చారు. మరోవైపు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలకు మండపాలు సిద్ధమవుతున్నాయి. విద్యుద్దీపాలంకరణకు అన్నీ సిద్ధం చేస్తున్నారు.

అశ్లీలతకు చోటులేదు



వినాయకచవితిని ప్రజలంతా ప్రశాంత వాతావరణంలో చేసుకునేలా చూడడం మా బాధ్యత. ఉత్సవ కమిటీలు కూడా మాకు సహకారం అందించాలి. మండపాల ఏర్పాటు విషయంలో తగిన భద్రత, ఇతర అంశాలను చూసుకుని పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలి. శబ్దకాలుష్యం నియంత్రించేందుకు గాను డీజేలకు అనుమతి ఇవ్వడం లేదు. ఊరేగింపుల్లో అశ్లీల నత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించం. అనుమతి నిర్దేశించిన చెరువుల్లోనే సమయ పాలన పాటిస్తూ నిమజ్జనం చేయాలి.

– కె.వి.సతీష్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ



పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను సాధ్యమైనంత వరకు తగ్గించి, మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకుంటే మంచిది. మండపాల వద్ద ప్లాస్టిక్‌ను వాడకూడదు. నిమజ్జనం సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నగర ప్రజలకు మంచినీటి అవసరాలు తీరుస్తున్నందున మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో గణపతి విగ్రహాల నిమజ్జనం నిషేధించాం.

– కె.హేమావతి, జోనల్ కమిషనర్, జోన్–8

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు

పెందుర్తి : ఆపదలో ఉన్న వారి కోసం ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయాలని పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నరసింగరాజు సూచించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు. స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పెందుర్తి కూడలి వద్ద స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 30 మంది దాతలు రక్తదానం చేశారు. అనంతరం ఎల్వీ ప్రసాద్ మోషిన్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన 40వ జాతీయ పక్షోత్సవాల్లో 12 మంది మరణానంతరం తమ నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతూ పత్రాలు అందించారు.

ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ మురళి, ట్రస్ట్ ప్రతినిధులు యల్లపు అనిల్‌కుమార్, సిరిమళ్ల గణేష్, సన్నీ యాదవ్, ములగాడ సూర్యభాను, మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి మనోజ్ పాల్గొన్నారు.

అపార్టుమెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



మాట్లాడుతున్న క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు

పెందుర్తి : నేరాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు కోరారు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌస్‌లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాలపై స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో సోమవారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పండగల వేళ చైన్ స్నాచింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలు అంశాలపై సూచనలు చేశారు. క్రైం విభాగం ఎస్‌ఐ డి.సూరిబాబు, అపార్ట్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అనుప్రియాంక, ప్రణతి తదితరులు

సబ్బవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని శాప్ డైరెక్టర్ పీబీఎస్‌ఎన్ రాజు అన్నారు. సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ఆయన కుటుంబ సభ్యులు అనుప్రియాంక, ప్రణతి చేతుల మీదుగా వెయ్యి మట్టి వినాయక ప్రతిమలను సోమవారం పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేస్తే నీరు, వాతావరణం కూడా కలుషితమవుతుందని, పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు. అందుకే ఆది దేవుడు గణపతి మట్టి ప్రతిమలనే పూజించాలని కోరారు. కార్యక్రమంలో సురేష్ వర్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

పరవాడ: రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్ ప్రకటనలో తెలిపారు. స్థానిక కమర్షియల్ హబ్ సమీపంలోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు, పరిశ్రమల ఉద్యోగులు, కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కీచక లెక్చరర్‌పై చర్యలకు డిమాండ్



మీడియాతో మాట్లాడుతున్న హేమంత్‌కుమార్

పరవాడ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మైనర్ విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కీచక లెక్చరర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థినిని లైంగికంగా వేధించిన కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలికకు న్యాయం చేయాలని కోరారు. ఘటన జరిగి మూడు రోజులవుతున్నా లెక్చరర్‌పై ఇంకా చర్యలు తీసుకోలేదన్నారు. అన్యాయానికి గురైన విద్యార్థినులు తమ ఇబ్బందులు చెప్పుకోవడానికి స్వేచ్ఛ లేకుండా పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన దిశ చట్టాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నీరుకార్చేసిందని ఆరోపించారు. విద్యార్థి విభాగం అధ్యక్షుడు చరణ్‌రాజ్, పాశాల దివ్యశేష తదితరులు పాల్గొన్నారు.

రామానుజాచార్యులకు అదీప్‌రాజ్ పరామర్శ



వెంకటాద్రి అర్చకుడు రామానుజాచార్యులను పరామర్శిస్తున్న అదీప్‌రాజ్, నాయకులు

పెందుర్తి : స్థానిక వెంకటాద్రి ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఉత్తరాంధ్ర అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు. ఇటీవల రామానుజాచార్యుల మాతృమూర్తి రాజమ్మ అనారోగ్యంతో మరణించారు. అదీప్‌రాజ్ వెంట పార్టీ నేతలు గొరపల్లి శ్రీను, అవగడ్డ శ్రీనివాస్, గొర్లె రాము, రఘు, పాత్రుడు ఉన్నారు.

నిమజ్జనం వేళ జాగ్రత్తలు పాటించాలి



సదస్సులో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు, నిమజ్జన వలంటీర్లు



విగ్రహం పెట్టేందుకు ఆసక్తి చూపుతున్న బాలుడికి అవగాహన కలిగిస్తున్న సీఐ సతీష్‌కుమార్

- ఉత్సవ కమిటీలకు పోలీసుల అవగాహన

పెందుర్తి: 'వినాయక చవితి ఉత్సవం అంటే యువకుల సందడి ఉంటుంది. కొన్ని చోట్ల సరదాగా పిల్లలు కూడా విగ్రహాలు పెడతారు. నవరాత్రుల వరకు వారి సరదా బాగానే ఉంటుంది. కానీ నిమజ్జనం సమయంలో తెలిసో తెలియకో చెరువుల్లో దిగుతారు. ఇది చాలా ప్రమాదకరం. పిల్లలు విగ్రహాలు పెట్టినా గ్రామం/కాలనీల్లోని పెద్దలు వారికి తగిన జాగ్రత్తలు చెబుతూ నడిపించాలి' అని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి సతీష్‌కుమార్ సూచించారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై కమిటీలకు, నిమజ్జన వలంటీర్లకు చినముషిడివాడలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు బాలురు సదస్సుకు హాజరు కావడం చూసి, వారికి పలు జాగ్రత్తలు చెప్పారు. అనంతరం మాట్లాడుతూ మండపాల వద్ద తగిన భద్రతా నియమాలు పాటించాలన్నారు. విద్యుత్ వైర్లు, దీపాల అలంకరణలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. వాహనాల పార్కింగ్ విషయంలో తగిన ప్రదేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం వేళ సమయ పాలన, నిబంధనలు పాటించాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది, వలంటీర్లు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి



మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

పరవాడ : ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి ప్రభుత్వమే ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడ సంతబయలులో ఆటో కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలపై ఈ నెల 28న తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగాలు రాక, వ్యవసాయం గిట్టుబాటు కాక వేలాది మంది నిరుద్యోగులు ప్రైవేటు వ్యక్తులు, బ్యాంకుల వద్ద అప్పులు చేసి ఆటోలు కొనుక్కుని ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రతీ నెల అప్పులు తీర్చుకుంటూ, పిల్లలను చదివించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఆటోల ద్వారా స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ప్రభుత్వం బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఆటోవాలాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతీ డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.25 వేలు అందించాలని కోరారు. జీవో నంబరు 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన అన్ని రకాల ఫీజులు, జరిమానాలు, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గించి వాహనాల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 17 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి : వేపగుంటలోని జీవీఎంసీ జోన్ – 8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు పలు సమస్యలపై 17 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన ఎస్‌జేఎస్ విద్యార్థులు

పెందుర్తి : యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ అర్థమెటిక్ సిస్టమ్ సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన యూసీఎంఎస్ అబాకస్ పోటీల్లో సుజాతనగర్‌లోని ఎస్‌జేఎస్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదటి రన్నరప్‌తోపాటు వివిధ విభాగాల్లో ఛాంపియన్‌షిప్ సాధించారు. సోమవారం వీరిని యూసీఎంఎస్ ఏపీ ఆపరేషన్స్ మేనేజర్ శ్రీకాంత్, సంస్థ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.

'స్త్రీ'శక్తి విజయోత్సవానికి ఆటోల్లో..

- బస్సులు లేని గ్రామాలు, కాలనీల నుంచి మహిళల తరలింపు
- కార్యక్రమానికి రాకపోతే జరిమానాలంటూ డ్వాక్రా మహిళలకు బెదిరింపులు


పెందుర్తి: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన స్త్రీ శక్తి ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం పథకం విఫలమైనా నియోజకవర్గ కేంద్రం పెందుర్తిలో కూటమి నాయకులు సోమవారం విజయోత్సవ ర్యాలీ తలపెట్టారు. అయితే ఉచిత బస్ పథకం ర్యాలీకి నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల నుంచి ఆటోల్లో మహిళలను బలవంతంగా తరలించడంతో కార్యక్రమం అభాసుపాలైంది. పేరుకు ఉచిత బస్ ప్రయాణంపై డబ్బాలు కొడుతూ ర్యాలీ.. కానీ ఆటోల్లో మహిళలు రావడం ఏంటని కూటమి పార్టీల నేతలే చర్చించుకోవడం కనిపించింది.

మరోవైపు ర్యాలీకి వచ్చిన ఆ కొద్దిమంది మహిళలను సైతం డ్వాక్రా సంఘాల ప్రతినిధుల ద్వారా బెదిరింపులతో తరలించారు. జీవీఎంసీ పరిధిలో ఏపీడీని, గ్రామీణ ప్రాంతంలో ఏపీఎంలను తమదైన శైలిలో కూటమి స్థానిక నాయకులు బెదిరించడంతో చేసేది లేక మహిళలను ర్యాలీకి బలవంతంగా ఆటోల్లో తీసుకువచ్చారు. రాకపోతే జరిమానాలు విధిస్తామని చెప్పడంతో కొందరు మహిళలు తప్పక ర్యాలీకి హాజరయ్యారు.

పెందుర్తిలో స్త్రీశక్తి ర్యాలీ

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం స్త్రీ శక్తి–మహిళలకు ఉచిత బస్ ప్రయాణం విజయం సాధించిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. పథకం విజయోత్సవ ర్యాలీని పెందుర్తిలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, మేయర్ పీలా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పెందుర్తి : సుజాతనగర్‌లోని శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని మణికంఠకు విశేష అభిషేకాలు చేశారు. అనంతరం అలంకరణ చేసి స్వామి సన్నిధిలో గోత్రనామాలతో అర్చనలు చేశారు. భక్తులకు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు.